ప్రజాశక్తి
మంగళవారం 28 జనవరి 2025
5
విజయనగరం



బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాపరిష్కార వేదికను నిర్వహించి, బాధితులనుంచి వినతులు స్వీకరించారు. ఈ వారం 34 మంది ఎస్‌పికి వినతులు అందజేశారు. అనంతరం పోలీసు అధికారులతో ఎస్‌పి మాట్లాడుతూ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పూర్వాపరాలను విచారణ చేసి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, ఎస్ఐ రాజేష్ , సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి ఎల్‌పిఎంలకు స్వస్తి

- వేర్వేరుగా ఇచ్చేందుకు కసరత్తు
- రైతులకు తీరనున్న ఇబ్బందులు
- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తున్న సర్వేయర్లు



ఉమ్మడి ఎల్‌పిఎంలపై రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేస్తున్న రైతులు (ఫైల్)

ప్రజాశక్తి - భోగాపురం

జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం హయాంలో కొన్ని రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే జరిగిన విషయం తెలిసిందే. అప్పట్లో సర్వే సిబ్బంది రైతుల భూములను ఉమ్మడి ల్యాండ్ పార్శల్ నెంబర్లు (ఎల్‌పిఎమ్) ఇవ్వడంతో రైతులు చాలా ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఒన్‌బిలు వచ్చేవి కాదు. దీంతో ఈ ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లు ఉన్న భూములను అమ్ముకునేందుకు వీలుపడేది కాదు. అలాగే బ్యాంకు నుంచి అత్యవసర సమయంలో రుణాలు పొందేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీనిపై రైతుల నుంచి అనేక ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. వీటిని విడదీసుకోవాలంటే సచివాలయంలో 550 రూపాయలు చలానా చెల్లిస్తే అప్పుడు అధికారులు వచ్చి పరిశీలించేవారు.

> గత ప్రభుత్వం హయాంలో జరిగిన రీసర్వేలో ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లతో ఇబ్బందులు పడిన రైతులకు ఉపశమనం కలగనుంది. వాటిని విడదీసేందుకు సర్వేశాఖ, రెవెన్యూ ఉమ్మడిగా తనిఖీ చేసి వీటిని సరిచేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు నోటీసులు పంపి సంబంధిత భూములను పరిశీలించి అనంతరం వారితో సచివాలయంలో 50 రూపాయలు చలానా చెల్లింపు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులతో చలానా చెల్లింపులు చేయిస్తున్నారు.

గతంలో ఒక్కో ఎల్‌పిఎంకు రూ.550.. నేడు రూ.50

గత ప్రభుత్వం హయాంలో ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లను వేరు చేసేందుకు సచివాలయంలో 550 రూపాయలు చలానా కట్టాలి. ఎన్ని ఎల్‌పిఎమ్‌లు ఉంటే అన్ని 550 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. కాని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ చలానాను 50 రూపాయలకు కుదించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీసర్వే జరిగిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను గత ఏడాది సెప్టెంబరు నెలలో నిర్వహించారు. ఇటీవలి అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ రెవెన్యూ సదస్సులను నిర్వహించిన విషయం తెలిసిందే. కాని సెప్టెంబరు నెలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లపైనే దరఖాస్తులు వచ్చాయి. ఒక్క భోగాపురం మండలంలో రీసర్వే జరిగిన 13 గ్రామాల్లో కేవలం ఎల్‌పిఎమ్‌లను విడదీయాలని 374 దరఖాస్తులు రావడం విశేషం. ఇలా జిల్లా వ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. వీటిని ప్రస్తుతం విడదీసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఉమ్మడి ఎల్‌పిఎంలు వేరు చేస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లు వేరు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. రీసర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి ఎల్‌పిఎమ్‌ల కోసం ఎవరైనా దరఖాస్తు ఇవ్వకపోతే సచివాలయంలో 50 రూపాయలు చలానా తీసి దరఖాస్తు మాకు అందజేయాలి. రెవెన్యూ సదస్సుల్లో ఎల్‌పిఎమ్‌ల సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వారందరితో చలానాలు తీయించి వేరు చేయనున్నాం.

- ఎం.సురేష్, తహశీల్దార్, భోగాపురం

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

పోలమాంబను దర్శించుకున్న మన్యం జిల్లా కలెక్టర్ దంపతులు ● నేడు శంబర సిరిమానోత్సం



ఘటాలతో పూజలు చేస్తున్న మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవంలో రైతులు పండించిన పంటను (ధాన్యం) అమ్మవారి గుడికి తెచ్చి రాశులుగా పోశారు. పూజారితోకలిసి ఘటాలు మోసే భక్తులు ఆ ధాన్యాన్ని కలియతొక్కారు. అనంతరం వాటిని రైతులు ఇళ్లకు తీసుకెళ్లి ధాన్యపు రాశుల్లో దాచుకొని, ఖరీఫ్‌లో పొలాల్లో చల్లుకోవడం ఆనవాయితీగా వస్తుంది. జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ కుటుంబ సమేతంగా అమ్మవారిని సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్య నిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ స్వాగతం పలికి దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం అమ్మవారి ఘటాలకు కలెక్టర్ కుటుంబం పూజలు చేశారు.

సిరిమానోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

మంగళవారం సిరిమానోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ నైదాన తిరుపతిరావు దగ్గరుండి పనులు పూర్తి చేయించారు. ఈ ఏడాది సిరిమానును పూజారి జన్ని పేకాపు రామారావు అధిరోహించనున్నారు. సిరిమానోత్సవానికి తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది తరలిరానున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చదురు గుడి వద్ద భారీ క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్ పర్యవేక్షణలో సిరిమాను తిరిగే తిరిగే ప్రాంతాల్లో 700 మందితో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సిరిమాను తిరిగే ప్రదేశంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి డ్రోన్ కెమెరాలతో పాటు సిసి కెమెరాల పర్యవేక్షణ కూడా చేపట్టనున్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పోలీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

హెల్మెట్‌తోనే ప్రాణ రక్షణ

ప్రజాశక్తి-విజయనగరం కోట



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

హెల్మెట్ ధరించండి ప్రాణాలకు కాపాడుకోవాలని వాహనదారులకు ఎస్‌పి వకుల్‌జిందాల్ సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించలేకపోవడం వలన ఎక్కువ సంఖ్యలో ఆక్సిడెంట్లలో ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. హైవేలలోనే కాకుండా అన్ని రహదారుల్లోనూ హెల్మెట్లు ధరిస్తే ప్రాణాలు కాపాడు కోగలుగుతామన్నారు. ప్రధానంగా యుక్త వయస్కులు, అధిక స్పీడ్‌లో వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. డ్రింకింగ్ చేస్తూ , సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం వలన ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావు, టూటౌన్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సిఐ లక్ష్మణరావు, పోలీస్ శాఖ, రవాణాశాఖ సిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

కమిషనర్‌పై చర్య తీసుకోవాలి

మున్సిపల్ ఆర్‌డికి అంబేద్కర్ రైట్స్ ఫోరం ఫిర్యాదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని, ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలకు బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదని, ఈనేపథ్యంలో ఆయనపై చర్య తీసుకోవాలని మున్సిపల్ ఆర్‌డికి అంబేద్కర్ రైట్స్ ఫోరం అధ్యక్షులు బి.భానుమూర్తి వినతి అందజేశారు. స్థానిక నగర పాలక సంస్థ నిధులతో శంఖుస్థాపన చేసే కార్యక్రమాలకు స్థానిక కార్పొరేటలను పక్కనపెడుతున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బందితో టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు సమాచారం పంపి, వారితో శంకుస్థాపనలు చేపట్టి కార్పొరేటర్లను అవమానిస్తున్నారని పేర్కొన్నారు.

తలగాం దళితులకు భూమి అప్పజెప్పాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - వంగర

మండలంలోని తలగాం గ్రామానికి చెందిన సుమారు 16 దళిత కుటుంబాలకు ప్రభుత్వం కేటాయించిన భూమిని తిరిగి వారికి అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ గ్రామంలో సర్వేనెంబర్-6లో ఉన్న 16.73 ఎకరాల భూమిని 30 సంవత్సరాలుగా దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవారని అధికారుల చేతివాటంతో ఆ భూమిని పెత్తందారులకు కట్టబెట్టారని గుర్తు చేశారు. ఈ విషయమై గత 2 సంవత్సరాలు నుంచి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించడం లేదన్నారు. పెత్తందారులు ఆ భూమిని సాగు చేసుకుంటూ ఫలసాయాన్ని అనుభవిస్తున్నారన్నారు. దళితులైన పేదలు ఉపాధి లేక వలసలు పోతున్న దారుణమైన పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రభుత్వ భూమిని పేదలైన దళితులకు వెంటనే అప్పజెప్పాలని ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన పెత్తందారులను ఆ భూమి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించకపోతే తామే దళితులతో కలిసి భూమి ఆక్రమిస్తామని హెచ్చరించారు. దానివల్ల జరిగే పరిణామాలకు రెవెన్యూ అధికారులే బాధ్యత వహించాలన్నారు. అనంతరం తహశీల్దార్ డి ధర్మరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి.శంకర్రావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్, నియోజకవర్గ సిపిఎం పార్టీ నాయకులు యం. త్రినాధరావు, తలగాం దళితులు పాల్గొన్నారు.

30వేల ఇళ్లకు పిఎం సూర్యఘర్ పథకం

ప్రజాశక్తి-విజయనగరంకోట

మొదటి విడతగా జిల్లాలో సుమారు 30 వేల ఇళ్లకు పిఎం సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఫిబ్రవరి నుంచి యూనిట్ల ఏర్పాటు ప్రారంభించి, మార్చినాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పథకం అమలుపై జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 24,754 మంది ఎస్‌సి లబ్దిదారులు, 4,569 మంది ఎస్‌టి లబ్దిదారులు, 6,897 మంది ఇతర లబ్దిదారులు ఈ పథకం కింద తమ పేర్లను రిజిష్టర్ చేసుకున్నారని కలెక్టర్ చెప్పారు. మున్సిపాల్టీలకు సంబంధించి విజయనగరం అర్బన్‌లో 2,176 మంది, బొబ్బిలిలో 479 మంది, రాజాంలో 579 మంది, నెల్లిమర్లలో సుమారు 150 మంది ఎస్‌సీ లబ్దిదారులను గుర్తించినట్లు తెలిపారు. స్వయంశక్తి సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా, ఇతర సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించి, పిఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఔత్సాహిక స్వయం శక్తి సంఘాలను సైతం వెండార్‌లుగా గుర్తించి, వారికి యూనిట్లను ఏర్పాటు చేసే కాంట్రాక్టును ఇప్పించాలని సూచించారు. సమావేశంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ చిట్టిరాజు, ఎల్‌డిఎం వివిఆర్ మూర్తి, జెడిఎ విటి రామారావు, డిపిఒ టి.వెంకటేశ్వర్రావు, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆతవ గ్రామస్తులు, నాయకులు

ఆతవ రోడ్డుకు మోక్షం కల్పించండి

గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-వేపాడ

అధ్వానంగా తయారైన ఆతవ రోడ్డుకు మోక్షం కల్పించాలని కోరుతూ ఆ గ్రామస్తులు సోమవారం నిరసన చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో తమ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల మేర బిటి రోడ్డు వేసేందుకు పాత రోడ్డును తొలగించి, మెటల్, క్రషర్ బుగ్గి వేసి వదిలేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. అప్పటి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతోపాటు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన కూటమి అభ్యర్థి కోళ్ల లలితకుమారి.. తనను గెలిపిస్తే, గెలిచిన వెంటనే రోడ్డు వేసే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చారని గుర్తుచేశారు. ఏడు నెలలు గడిచినా ఎమ్మెల్యే లలితకుమారి రోడ్డు ప్రస్తావన తీసుకురావడం లేదని మండిపడ్డారు. అందుకే నిరసనకు దిగామని చెప్పారు. సమాచారం తెలుసుకున్న డిఇ జి.సత్యనారాయణమూర్తి, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ నిరసన వద్దకు వెళ్లి పది రోజుల్లో పని ప్రారంభిస్తామని హామీనిచ్చారు. అందుకు వారు అంగీకరించలేదు. వెంటనే రోడ్డు పని ప్రారంభించాలని, లేకుంటే ఎప్పుడు చేపడతారో రాత పూర్వకంగా ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు చేసేదేమీలేక వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆతవ ఉదయ భాస్కర్, సిపిఎం నాయకులు చల్లా జగన్, దళిత నాయకులు గంటాన అప్పారావు, జి.ఈశ్వరరావు, నాగరాజు, కె.దేవుడు, బోని నాగరాజు, మాజీ సర్పంచ్ టి.సన్నిబాబు, డప్పు రాజు, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు 174 వినతులు

పరేడ్ గ్రౌండ్స్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసిన వారికి ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 174 వినతులు వచ్చాయి. భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 119 , వినతులు అందాయి. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతమాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని తెలిపారు. ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసు లు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ లో పదే పదే దరఖాస్తులు పెట్టేవారు , అలవాటుగా ప్రతి వారం పెట్టేవారి వివరాలను సమర్పించాలని , వారి వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతామన్నారు.

స్టాల్స్ కు ప్రశంసా పత్రాలు

రిపబ్లిక్ డే సందర్భంగా పోలీస్ పెరేడ్ లో స్టాల్స్ ఏర్పాటు చేసిన శాఖల అధికారులకు పిజిఆర్‌ఎస్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశంసా పాత్రలను అందజేశారు. డిఆర్‌డిఎ, పౌర సరఫరాలు , వ్యవసాయం, పశు సంవర్ధకం , మత్స్య, వైద్య , స్కిల్ డెవలప్‌మెంట్ , కాలుష్య నియంత్రణ , సర్వే ల్యాండ్ రికార్డ్స్ , ముఖ్య ప్రణాళికాధికారి, గిరిజన సంక్షేమం, ఐసిడిఎస్., సెంచూరియన్ యూనివర్సిటీ శాఖల అధికారులు ఈ ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

మా డబ్బులు మాకు ఇప్పించండి

మా డబ్బులు మాకు ఇప్పించండి అంటూ ఎస్ఎల్ఎఫ్ సంఘ సభ్యులు డిమాండ్ చేస్తూ ప్రజా సమస్య పరిష్కార వేదికలో వినతి అందజేశారు. అనంతరం వారంతా కలెక్టరేట్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. నగరంలోని 24వ డివిజన్ బూర్లి పేట శ్రీ గాయత్రీ దేవి ఎస్ ఎల్ ఎఫ్ సంఘ సభ్యులు గత 15ఏళ్లగా క్రమం తప్పకుండా ప్రతినెలా పొదుపు కడుతున్నామని, ఎస్ఎల్ఎఫ్‌లో అంతర్గత అప్పులు తీసుకొని అసలు, వడ్డీ క్రమం తప్పకుండా కడుతున్నామని తెలిపారు. ఎస్ఎల్ఎఫ్ వల్ల ఉపయోగం లేకపోవడంతో దాన్ని రద్దు చేసుకోవాలని నిర్ణయించామన్నారు. మూడు నెలలుగా మెప్మా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సిబ్బంది స్పందించడం లేదన్నారు. వెంటనే తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరారు.

పాల రైతులకు న్యాయం చేయండి

విజయనగరం టౌన్ : విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రాలకు రైతులు పోస్తున్న పాలలో 10శాతం పాలను వెనక్కి పంపుతున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంబాబు, జిల్లా నాయకులు ఎల్.ఆదినారాయణ మూర్తి, గొంప కృష్ణమూర్తి కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. విశాఖ డెయిరీ ఆవుపాలు లీటర్ ఒక్కంటికి రూ2.60నుండి రూ.4 వరకు గత 3 నెలలుగా తగ్గించారని, . రైతులు ఈ తగ్గింపును వ్యతిరేకిస్తూ డెయిరీ వద్ద ఆందోళన చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం హౌస్ కమిటీ వేసి విచారణ చేస్తోందని అన్నారు. తాజాగా ఈనెల 24 నుంచి పాల సేకరణ కేంద్రాలకు పోస్తున్న పాలలో 10శాతం వెనక్కి పంపడం అన్యాయమని తెలిపారు.

రూ.15వేలకు పింఛను పెంచండి



కుమారుడితో కలిసి గ్రీవెన్స్‌కు వచ్చిన వరలక్ష్మి

తమ కుమారుడికి వస్తున్న రూ.6వేల పింఛనును రూ.15వేలకు పెంచాలని కోరుతూ బాధితుడి తల్లి గడే వరలక్ష్మి అధికారులను కోరింది. కుమారుడు మణికంఠ దిలీప్‌కు ఎనిమిదో ఏట నుంచి క్రమేపి కాళ్లు చేతులు చచ్చుబడిపోయి మంచానికే పరిమిత మయ్యాడని తెలిపారు. మాట్లాడటం తప్ప మరే పనులూ చేసుకోలేడని, కదలలేని స్థితిలో ఉన్న దిలీప్‌కు రూ.15వేలు పింఛను ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న డబ్బులు మందుల ఖర్చుకు కూడా చాలనందున పింఛను పెంచాలని కోరారు.




కలెక్టర్‌కు వినతినిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

అంగన్‌వాడీలకు వేతనాలిచ్చి ఆదుకోండి

గత డిసెంబర్ నెల జీతాలు చెల్లించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. పలుమార్లు వినతులిచ్చానా స్పందన లేదని ఆవేదన చెందారు. గత సోమవారం వినతి ఇచ్చిన సందర్భంగా డిసెంబర్ మరుచటిరోజు సాయంత్రం లోపు జీతాలు పడతాయని హామీ ఇచ్చారని, కానీ ఇవ్వలేదని తెలిపారు. రెండు నెలలుగా జీతాలు లేక అంగన్వాడీలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ డిసెంబర్ నెల జీతాలు ఫిబ్రవరి 5వ తేదీ లోపు వస్తాయని, జనవరి నెల జీతాలు ఫిబ్రవరి ఒకటో తేదీకి ఎకౌంట్లో పడతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి పైడిరాజు, ఎస్.అనసూయ, జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, కె. ప్రభావతి పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులకు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మధ్యవర్తిత్వం ద్వారా చాలవరకు కేసులకు పరిష్కారం చూపవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తి సూచించారు. వ్యాజ్యాల పరిష్కారానికి రాజీ కూడా ఒక మార్గమేనని ఆయన స్పష్టం చేశారు. సుప్రీకోర్టు మీడియేషన్ కౌన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో, స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో, ఉమ్మడి జిల్లా న్యాయవాదులకు, రిటైర్ట్ న్యాయాధికారులకు, సామాజిక కార్యకర్తలకు 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా న్యాయమూర్తి సాయికల్యాణచక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రారంభోపన్యాసం చేసూ ఎన్ఐ చట్టానికి సంబంధించి, చెక్‌బౌన్స్ కేసులో పదేళ్లకు పైగా తిరిగే బదులు, మధ్యవర్తిత్వం ద్వారా ఈ కేసును పరిష్కరించుకుంటే, సమయం, డబ్బు ఆదా అవుతాయని ఉదహరించారు. ఇరుపక్షాల ఆలోచనా దృక్పథాన్ని మార్చడం ద్వారా ఇలాంటి కేసులకు పరిష్కారం సూచించవచ్చునని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ, శిక్షణా కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. రీసోర్సు పర్సన్లు ఎస్.అరుణాచలం, సుదర్శన్ సుందర్, రెండు జిల్లాలకు చెందిన పలు న్యాయవాదులు పాల్గొన్నారు.

రసాభాసగా పాడి రైతుల సమావేశం

ప్రజాశక్తి-రామభద్రపురం

స్థానిక విశాఖ డెయిరీ యూనిట్ ఆఫీసు ఆవరణలో సోమవారం బోర్డు డైరెక్టర్ పిల్లా రమాకుమారి సుమారు 10 మండలాలకు చెందిన పాల కేంద్ర సంఘాల అధ్యక్షులు, సిబ్బంది, రైతులతో నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. నిర్దేశిత సమయాని కన్నా సుమారు 3 గంటల ఆలస్యంగా డైరెక్టర్ వచ్చినా ఓపికతో ఎదురు చూసిన రైతులు సభ ప్రారంభంలోనే.. డెయిరీ తీసుకున్న వ్యతిరేక చర్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో రమాకుమారి సభనుంచి వెంటనే వెళ్ళి పోయేందుకు సిద్ధం అవడంతో రసాభాసాగా మారింది. ఆమె ప్రసంగంలో ఎక్కడా రైతుకు భరోసా వచ్చేలా లేకపోవడం, పాల సేకరణ ధర పెంచుతామనే వాగ్దానం రాకపోవడం, నాణ్యత, పాల సేకరణ విధానాలపై వారు చెప్పే షరతులలో సడలింపు లేకపోవడంతో మరలా సభ గందరగోళంగా మారింది. దీంతో వెంటనే అసహనం వ్యక్తం చేస్తూ బోర్డు డైరెక్టర్ రమా కుమారి కారెక్కి వెళ్లిపోయారు. ఆమె రాక కోసం వేచి ఉన్న సమయంలో పావు వంతు సమయం కూడా సభ నిర్వహించకుండా, రైతన్నల వేదన వినకుండా అలా వెళ్లిపోవడంతో పాల సంఘాల అధ్యక్షులు, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా డెయిరీనే నమ్ముకొని ఉంటున్నా ఇప్పుడు జీవనోపాధి కరువయ్యేలా పాలకవర్గం వ్యవహరిస్తున్న తీరు ఆవేదన కలుగుస్తుందని పలువురు రైతులు మండిపడ్డారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

4.30 గంటల వ్యవధిలోనే కనుగొన్న పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న బాలిక చరిష్మా

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని మంగళపాలెం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం కేసును కొత్తవలస పోలీసులు కొద్ది గంటల వ్యవధిలోనే ఛేదించారు. ట్రేస్ చేసిన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళపాలెం గ్రామానికి చెందిన వెలమ చరిష్మా (11) లక్కవరపుకోటలోని ఎపి మోడల్ స్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. ఆదివారం పాఠశాలలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లిన చరిష్మా.. అనంతరం స్నేహితురాలితో కలిసి జమ్మాదేవిపేటలోని వారింటికి వెళ్లింది. సాయంత్రం అక్కడి నుంచి బయల్దేరిన ఆమె.. మంగళపాలెం బస్టాప్ వద్దకు వచ్చి, మెడికల్ షాపు వద్ద నుంచి తన తండ్రితో ఫోనులో మాట్లాడింది. సాయంత్రం వరకు ఇంటికి చేరక పోవడంతో ఆందోళన చెంది, కొత్తవలస పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తక్షణమే స్పందించి, దర్యాప్తు ప్రారంభించారు. సిఐ షణ్ముఖరావు తప్పిపోయిన బాలిక ఫొటోలను విశాఖపట్నం సిటీ పోలీసులకు పంపి, వెతికే ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ సుదర్శనరావుతో ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, బాలికను కనుగొనేందుకు చర్యలు చేపట్టారు. ఎస్ఐ సుదర్శనరావు అదృశ్యమైన బాలిక స్నేహితులు, మెడికల్ షాపు, తోపుడు బండ్ల వ్యాపారులను, స్థానికులను విచారించి, కొంత సమాచారం రాబట్టారు. అనంతరం సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించి, బాలికను ట్రాక్ చేసి, పెందుర్తి వైపు వెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు పెందుర్తి, చుట్టుపక్కల ప్రాంతాల్లో బాలిక గురించి విచారణ చేపట్టారు. చివరికి పెందుర్తి బస్టాప్ వద్ద చరిష్మాను గుర్తించి, కొత్తవలస తీసుకొచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. అదృశ్యమైన 4.30 గంటల్లోనే బాలికను ట్రేస్ చేసిన సిఐ షణ్ముఖరావు, ఎస్ఐ సుదర్శనరావు, మంగళపాలెం ఎంఎస్‌పి గోకాడ లక్ష్మి, హెచ్‌సి మురళి, కానిస్టేబుల్ దేముడు, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులతో కోచ్

జాతీయ త్వైక్వాండో పోటీలకు 11 మంది క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28 నుండి 30వరకు హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగే 7వ క్యాడిట్ నేషనల్ త్వైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి 11 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. వీరిని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర త్వైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, జిల్లా త్వైక్వాండో చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అభినందించారు. త్వైక్వాండో టీమ్‌కు కోచ్ గా కె.చైతన్య వ్యవహరిస్తున్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని ఎం.రావివలస, ఇప్పలవలస గ్రామాలలో సోమవారం పశువైద్య శిబిరాలను నిర్వహించినట్లు పశు వైద్యాధికారి హైమావతి తెలిపారు. రెండు గ్రామాల్లో కలిపి 469 పశువులు, దూడలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. 12 పశువులకు ఎద ఇంజక్షన్, 56 పశువులకు చూడు పరీక్షలు నిర్వహించామన్నారు. 66 ఎదకురాని, చూలుకు రాని పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు, 400కోళ్లకు పౌల్ టీకాలు వేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ తాజుద్దీన్ బాబా జయంతి

ప్రజాశక్తి - భోగాపురం

హజరత్ తాజుద్దీన్ బాబా 164వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు దాకమర్రి గ్రామం వద్ద ఉన్న తాజుద్దీన్ బాబా ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబాను ఊరేగింపుగా తీసుకెళ్లి జన్మదిన వేడుకలను నిర్వహించారు.

నేడు పింఛనుదారుల సదస్సు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇపిఎస్, రిటైర్డ్ వర్కర్స్ పింఛన్‌దార్ల సదస్సు జయప్రదం చేయాలని ఇపిఎస్ పింఛన్ల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. సోమవారం ఆయన నెల్లిమర్లలో ఇపిఎస్ పింఛన్ల సమస్యపై కర పత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇపిఎస్, రిటైర్డ్ కార్మికులకు కనీస పింఛన్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న కెపిటెల్ ప్రజా సంఘాల కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ని కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని వచ్చే నెలలో బడ్జెట్ సమావేశాలు సందర్భంగా రాష్ట్ర సదస్సు, ఛలో ఢిల్లీ కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరుతూ సదస్సు జరుగుతుందని తెలిపారు.

గురజాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వారధి వరల్డ్ ఫస్ట్ గ్లోబల్ యూత్ కాంపైన్ రామాయణం 'విలువలు' పై నిర్వహించిన సదస్సులో గురజాడ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ప్రతిభను కనపరిచారు. కార్యక్రమంలో సుమారు 60 పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్న సదస్సులో గురజాడ చిన్నారులు పి ప్రణీత్, కె.లహరి, ఎ.అస్మిత బృందం అద్భుత ప్రతిభ కనపరిచి ప్రథమ బహుమతిని, నగదు పురస్కారాన్ని సాధించారు. వ్యాసరచన పోటీలలో సిహెచ్. జాహ్నవి ప్రథమ బహుమతిని సాధించింది. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను గురజాడ పాఠశాలలో ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీని అభినందించారు.

ఆర్‌టిసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ కలిసి, వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎపియస్ఆర్‌టిసి ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ స్టేట్ పబ్లిక్ సెక్రెటరీ ఎ. అశోక్ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన ప్రకారం కాంట్రాక్టర్లు జీతాలు ఇవ్వడం లేదన్నారు. ప్రతినెలా 10వ తేదీలోపు జీతాలు ఆయా కాంట్రాక్టర్లు ద్వారా కార్మికుడి బ్యాంకు ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారం అందజేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - చీపురుపల్లి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కేంద్రాలలో ప్రతి ఒక్క పిల్లవానికి పౌష్టికాహారం అందజేసి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా తీసుకున్నామని చీపురుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిఒ. ఎం.రాజేశ్వరి అన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ పరిధిలో గల కేంద్రాలన్నింటిలోనూ పిల్లల బరువులు ఎత్తులను పరిశీలిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే పట్టణ పరిధిలో గల రామాంజనేయ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువులు ఎత్తులను పిఒ సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త బి రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త బొబ్జీ మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం



మండలంలోని ఆరికతోట గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా పూర్వ కార్యదర్శి పుసర్ల బొబ్జీ (64) మరణించారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. సోమవారం ఆశేష జనవాహిని మధ్య ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. బొబ్జీ మృతికి పలువురు సంతాపం తెలియజేశారు.

ఆయాలకు శిక్షణ

వేపాడ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు స్థానిక ఎంఆర్‌సిలో సోమవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఎంఇఒలు నాగభూషణరావు, బాలభాస్కరరావు మాట్లాడుతూ పాఠశాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ పెంపకంపై వివరించారు. పెంచిన ఆకుకూరలు, కూరగాయలు మధ్యాహ్న భోజన పథకంలో ఉపయోగించాలని సూచించారు.

కల్లుగీత కార్మికులకు రెండు షాపులు

బొబ్బిలి : బొబ్బిలి సర్కిల్ పరిధిలో రెండు మద్యం షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఇందులో బొబ్బిలి పట్టణంలో ఒకటి, బొబ్బిలి రూరల్ మండలానికి ఒకటి కేటాయించినట్లు వెల్లడించారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డు నాయుడు కాలనీలో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు సోమవారం పరిశీలించారు. మున్సిపల్ డిఇఇ కిరణ్‌కుమార్, ఎఇ రవిశంకర్‌తో కలిసి రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించారు. సిసి రోడ్డు నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను చైర్మన్ సూచించారు.

గొయ్యిని పూడ్చిన పోలీసులు

బొబ్బిలి : పట్టణంలో సాయినగర్ కాలనీ సమీపంలో బొబ్బిలి-పార్వతీపురం రోడ్డులో మధ్యలో ఏర్పడిన గొయ్యిని పోలీసులు పూడ్చారు. రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందారు. గొయ్యిని పూడ్చాలని ప్రజలు, వాహనదారులు ఆర్‌అండ్‌బి అధికారులను కోరారు. పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్ స్పందించి ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ పోలీసులు గొయ్యిని పూడ్చారు.

రిజర్వాయర్లు పూర్తికాని చోట

ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటి సరఫరా

అమృతధార ప్రాజెక్టుపై కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో అమృతధార పథకం కింద రిజర్వాయర్ల ద్వారా గ్రామాలకు శాశ్వత తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించేటపుడు ఆయా ప్రాంతాల్లోని సాగునీటి ప్రాజెక్టుల రిజర్వాయర్లలో నీటిలభ్యత సాధ్యాసాధ్యాలను దృష్టిలో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గ్రామీణ నీటిసరఫరా అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన, నీటిలభ్యత పుష్కలంగా వున్న సాగునీటి ప్రాజెక్టుల నుంచి మాత్రమే ఈ పథకానికి నీటి సరఫరా జరిగేలా ప్రతిపాదనలు చేయాలన్నారు. అమృతధార పథకంపై జలవనరులు, గ్రామీణ నీటిసరఫరా అధికారుల సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యంగా తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టు ద్వారా నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగ మండలాలు, గుర్ల మండలానికి తాగునీటిని సరఫరా చేయాలని గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. దీనిపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తారకరామ తీర్థసాగరం పనులు ప్రస్తుతానికి పూర్తికానందున అందుకు ప్రత్యామ్నాయాలు ఆలోచించి నెల్లిమర్ల నియోజకవర్గ పరిధి గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటిసరపరాకు అన్వేషించాలన్నారు. అవసరమైతే మడ్డువలస ప్రాజెక్టు నుంచి నీటి సరఫరాపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. మిగిలిన ప్రాజెక్టుల ద్వారా నీటిసరఫరాకు సంబంధించి కూడా ప్రాజెక్టుల వారీగా సమావేశంలో చర్చించారు. మడ్డువలస ప్రాజెక్టు ద్వారా 8, తాటిపూడి ద్వారా 9, తోటపల్లి ప్రాజెక్టు ద్వారా 4, ఆంధ్ర రిజర్వాయరు ద్వారా ఒక మండలానికి, తారకరామ తీర్థసాగరం ద్వారా 5 మండలాలకు కలసి మొత్తం జిల్లాలోని 1621 గ్రామాలకు 2058 నాటికి పెరిగే జనాభా అవసరాల మేరకు ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు అంచనాలు రూపొందించామని గ్రామీణ నీటిసరఫరా శాఖ ఎస్ఇ కవిత చెప్పారు. రూ.3300 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. జలవనరుల శాఖతో సమన్వయ సమావేశం నిర్వహించిన తర్వాత మాత్రమే ప్రతిపాదనలు రూపొందించాలని గ్రామీణ నీటిసరఫరా ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆదేశించారని ఎస్ఇ తెలిపారు. సమావేశంలో తారకరామ తీర్థ సాగరం ఎస్ఇ స్వర్ణకుమార్, ఇఇ అప్పలనాయుడు, డిఇ హరికృష్ణ, జలవనరుల శాఖ ఇఇ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బోర్ల మరమ్మత్తులకు ఫిబ్రవరి 1 నుంచి క్రాష్ ప్రోగ్రాం

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంబేద్కర్ గ్రామీణ నీటిసరఫరా అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి బోర్ల మరమ్మత్తులు చేపట్టేందుకు క్రాష్ ప్రోగ్రాం చేపడుతున్నట్టు ఎస్ఇ కవిత వివరించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి, జిల్లా పరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ, డ్వామా పీడీ శారదాదేవి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ సుధారాణి, డిఇఒ మాణిక్యం నాయుడు, విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్.ఇ. లక్ష్మణరావు, డిఎంహెచ్ఒ జీవనరాణి, గిరిజన సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు, భూగర్భ జలశాఖ అధికారి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





కేకులను కట్ చేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

యువగళంతో ప్రజల్లో మార్పు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో సోమవారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేసేందుకు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రజల్లో మార్పు తెచ్చిందన్నారు. రాష్ట్రంలో మూడవసారి ముఖ్యమంత్రిగా ఆయన చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తెచ్చిపెడితే గత ఐదేళ్లలో మూర్ఖపు పాలనతో ఆ పరిశ్రమలన్నీ వెనక్కి వెళ్లిపోయాయని అన్నారు. వెనక్కి వెళ్లిన పరిశ్రమలన్నీ తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, రాజేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, అవనాపు విజయ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గండ్రేటి సత్యనారాయణ, సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, కనకల మురళీమోహన్ , కంది మురళి నాయుడు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : యువగళం పాదయాత్ర ముగిసి సరిగ్గా రెండేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం నెల్లిమర్ల నగర పంచాయతీ పార్టీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులతో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రను వైసిపి అడ్డుకోవాలని కుట్రలు పన్నినా జన బలంతో యుగళం పాదయాత్ర ముగింపు వరకు సాగిందన్నారు. ముగింపు సభ భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలోని నిర్వహించడం ఒక శుభ పరిణామ మన్నారు. ఉద్యోగాలు కల్పనా లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ చేసిన దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, పార్లమెంటు అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఎపి స్వర్గధామం : బేబినాయన

బొబ్బిలి : పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామమని ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్.. దావోస్ పర్యటన శ్రమ ఫలితం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి నెట్టేశారని చెప్పారు. మరో ఇన్నోవేషన్‌కు శ్రీకారం చుట్టి, ఎఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో సిఎం భేటీ అయ్యారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉన్న అపార వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ పాలసీల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించి ఆహ్వానించారని చెప్పారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు

డిజిటల్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ హెచ్చరిక

ప్రజాశక్తి-వేపాడ

విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని ఎంపిడిఒ సూర్యనారాయణ హెచ్చరించారు. గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ ఛాంబర్‌లో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా రోజువారి సచివాలయాల్లో విధులకు హాజరు కావాలని సూచించారు. మూమెంట్ రికార్డులో రోజువారి సంతకాలు కూడా తప్పనిసరిగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని ఆరోపణలు వస్తున్నాయని, వాటిని సరిచేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో అక్షరాస్యత బాధ్యత వాలంటీర్లే కాకుండా మీరు పర్యవేక్షణ చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

సింగరాయి సచివాలయంలో ఆధార్ సేవలు

మండలంలోని సింగరాయి సచివాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభించినట్లు ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. సచివాలయ పరిధిలోని జగ్గయ్యపేట, అరిగిపాలెం, సింగరాయి గ్రామస్తులు ఆధార్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు ఆధ్వర్యంలో సోమవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పశువులకు పశువైద్యాధికారి భానుమతి తనిఖీలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బుద్ధ అప్పలనాయుడు, పశువైద్య సహాయకులు చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రంగరాయపురంలో పశువైద్య శిబిరం

లక్కవరపుకోట : మండలంలోని రంగరాయపురంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి ఆధ్వర్యాన నిర్వహించారు. పశువులకు చికిత్స చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కరెడ్ల రామలక్ష్మి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యంపై ఆందోళన

విజయనగరం కోట : ఎపెక్స్ కళాశాల హాస్టల్ విద్యార్థి అదృశ్యంపై తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈనెల 24న నెల్లిమర్ల మండలం కొండవెలగాడ దగ్గర గల ఎపెక్స్ కళాశాల హాస్టల్లో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన విద్యార్థి దత్తిచైతన్య (17) అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రులకు సమాచారం అందడంతో కళాశాలకు వెళ్లి సమాచారం అడగగా సరైన స్పందన లేకపోవడంతో సోమవారం విజయనగరంలోని ఎపెక్స్ కాలేజి మెయిన్ బ్రాంచ్ వద్ద ఆందోళన చేశారు. వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు దీనిపై స్పందిస్తూ ఇప్పటికే కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి-వేపాడ

వల్లంపూడిలో ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఎంఇఒ ఎన్.నాగభూషణరావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అరిగిపాలెంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రధానోపాధ్యాయులతోపాటు సిఆర్‌పి రాంప్రసాద్ పాల్గొన్నారు.

'బొబ్బిలి రాజులపై తప్పుడు ప్రచారం తగదు'

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి రాజులపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని న్యాయవాది గంటి గోపాలకృష్ణ శర్మ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పేదల భూమిని బొబ్బిలి రాజులు ఆక్రమించారని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గొల్లపల్లిలో సర్వే నంబర్ 632, 633, 634, 635లో ఉన్న భూమి రాజుల పూర్వీకుల నుంచి వస్తే, పేదల భూమి ఆక్రమించారని ఆరోపణలు చేయడం భావ్యం కాదని తెలిపారు. దీనిపై హైకోర్టులో కేసు వేస్తే, రాజులకు భూమి ఇవ్వాలని కోర్టు ఆదేశించిందని చెప్పారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు 2019లో వైసిపి ప్రభుత్వ హయాంలో భూములు అప్పగించారని వెల్లడించారు. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే లీగల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగునీటి కాలువలు మూసివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడ మెట్ట నుంచి జోడుబందల జంక్షన్ వరకు తారు రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. తునివాడ గ్రామ సమీపం సాగునీటి కాలువలు ఉన్నప్పటికీ, కాంట్రాక్టర్ సాగునీటి కాలువలను కప్పివేయడంతో పంట పొలాలకు చుక్కా నీరు కూడా రావడంలేదని మాజీ సర్పంచ్ జగ్గునాయుడు, ఉమామహేశ్వరరావు సోమవారం తహశీల్దార్ చిన్నరావుకు వినతిపత్రం అందించారు. గత నాలుగేళ్ల నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని, కాలువలు కప్పి వేయడం సాగునీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 200 రైతులకు సంబంధించి 100 ఎకరాలకు సాగునీరు రాకపోవడంతో వ్యవసాయ భూములకు నీరు అందక పంటలు పండించలేకపో తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మట్టితో మూసివేసిన సాగునీటి కాలువలను యథావిధిగా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

లక్ష్యాలను అధిగమించాలి

విజయనగరం టౌన్ : పిఎం ఇంటర్న్‌షిప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమించాలని కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పతి సచివాలయం నుండి కనీసం 20 మంది పేర్లను తక్షణమే నమోదు చేసే విధంగా చొరవ చూపాలలి అన్నారు.



మంత్రి దుర్గేష్‌ని కలిసిన ఎమ్మెల్యే లోకం మాధవి, కాకర్లపూడి శ్రీనివాసరాజు

రైతుల భూములను తీసుకోవద్దు

టూరిజం మంత్రితో పాటు ఎమ్‌డిని కోరిన ఎమ్మెల్యే, కాకర్లపూడి

ప్రజాశక్తి - భోగాపురం

ఒబెరాయ్ హోటల్‌కు వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న రహదారిని కాదని భూసేకరణ చేసి దిబ్బల పాలెం రైతులకు అన్యాయం చేయవద్దని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఆ శాఖ ఎండి అమ్రపాలిని ఎమ్మెల్యేతో పాటు నాయకులు కోరారు. పర్యటకరంగం అభివృద్ధి కోసం విశాఖలో సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ఎమ్మెల్యే లోకం మాధవితో పాటు జనసేన నాయకులు లోకం ప్రసాద్, కాకర్ల పూడి శ్రీనివాసరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు మంత్రి దుర్గేష్‌తో పాటు టూరిజం శాఖ ఎమ్‌డిని కలిశారు. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం రెవెన్యూలో భోగాపురం మండలం దిబ్బలపాలెం సమీపంలోని సరిహద్దులో ఒబెరాయ్ హోటల్ నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ హోటల్‌కి ప్రస్తుతం వెళ్లేందుకు ఉన్న రహదారిని వినియోగించుకుంటే బాగుంటుందని తెలిపారు. కానీ ఈ రహదారిని వెడల్పు చేసేందుకు భూ సేకరణ చేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికే విమానాశ్రయం పేరుతో అనేక భూములను తీసుకున్నారని వివరించారు. ఉన్న కాస్త భూములను తీసుకుంటే రైతులు రోడ్డున పడతారని తెలిపారు. ఇప్పటికే విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందక కోర్టులు చుట్టూ తిరుగుతున్నారని మళ్లీ ఇప్పుడు రోడ్డు విస్తరణకు భూములు తీసుకుంటే రైతులు రోడ్డున పడతారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న రహదరిని వాడుకుంటే రైతులకు న్యాయం చేసిన వారు అవుతారని వివరించారు.

వసతిగృహాలను పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - భోగాపురం

మండల కేంద్రంలో మరమ్మతులకు గురైన రెండు వసతి గృహాలను ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న బిసి వసతిగృహం మరమ్మత్తులకు గురి కావడంతో సుమారు 80 మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలకు తరలించారు. దీంతో బిసి వసతి గృహాన్ని మరమ్మతులు చేయించేందుకు అంచనాలు సిద్ధం చేయాలని ఇంచార్జ్ మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసకు ఎంపిపి ఆదేశించారు. ప్రస్తుతానికి నాలుగు గదులు సిద్ధం చేస్తే సరిపోతుందని తెలిపారు. శిథిలావస్తు చేరుకున్న గదులను కూల్చి వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపిడిఒ కె.గాయత్రి, వసతి గృహ వార్డెన్ అరుణ, ఎంఇఒ రమణమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పల్లి నల్లనయ్య సోమవారం పరిశీలించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యాన యూత్ హాస్టల్ వద్ద సిసి రోడ్డు చదును ప్రక్రియ చేపట్టారు. బిసి కాలనీలో పైపులైను తో ఓవర్ ఫ్లో పైప్ లైన్ ను అనుసంధానం చేసే ఎర్త్ వర్క్ కార్యక్రమాన్ని చేపట్టారు. వసంత విహార్ వద్ద 110 డయా హెచ్ డిపిఇ వాటర్ సప్లై పైపులైన్ పనులను ఇంజనీరింగ్ సిబ్బంది పరిశీలించారు. సర్వజన ఆస్పత్రి వద్ద నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను ఎఇ రవికుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలను సిబ్బందికి చేస్తున్నామన్నారు.

సర్పంచులను నిర్వీర్యం చేయడం తగదు

సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రాంబాబు

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామ పంచాయతీల అధికారాలను కుదించి ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచులను నిర్వీర్యం చేయడం సమంజసం కాదని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం చేస్తున్న తప్పుడు విధానాలనే టిడిపి కూటమి ప్రభుత్వం అవలంబిస్తూ సర్పంచులకు అధికారాలు లేకుండా చేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో క్లస్టర్ వ్యవస్థ లోపబూయిష్టంగా ఉందని, అప్పటి రాజకీయ సమీకరణాలు, అధికారులు ఇష్టారాజ్యంగా పంచాయతీ కార్యాలయాలకు బదులుగా సచివాలయాలను ఏర్పాటు చేశారని చెప్పారు. దీనివల్లన గ్రామాల అభివృద్ధి జరగలేదని అన్నారు. ఈ సచివాలయ వ్యవస్థ వల్ల ఆదాయం ప్రభుత్వానికి వెళుతోందే తప్ప పంచాయతీలకు ఏ విధమైన ఆదాయం రావడం లేదని చెప్పారు. రాజ్యాంగేతర శక్తుల ప్రమేయం పంచాయతీల్లో ఉండరాదని కోరారు. సమావేశంలో దుప్పలపూడి సర్పంచ్ వైకుంఠం విజయభాస్కరరావు, నాయుడువలస సర్పంచ్ ప్రతినిధి నడిమింటి సత్యం పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అదృశ్యమైన మహిళ మృతి

ప్రజాశక్తి- వేపాడ

ఇటీవల అదృశ్యమైన బొద్దాం గ్రామానికి చెందిన కె.వాణి (46) మృతిచెందింది. బావిలో వాణి మృతదేహాన్ని సోమవారం గుర్తించామని ఎస్ఐ బి.దేవి తెలిపారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సైబర్ నేరం కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్ గతయ ఏడాది నవంబర్‌లో నమోదైన సైబర్ మోసంలో నిందితుడికి కోర్టు ఈనెల 31వరకు రిమాండ్ విధించిందని సిఐ శ్రీనివాసరావు తెలిపారు. నవంబర్ 23న నగరంలోని పత్తిపాటి వీధికి చెందిన నాగవరపు శ్రీనివాసరావు ఆన్‌లైన్‌లో పర్సనల్ లోన్ గురించి గూగుల్‌లో సెర్చ్ చేయగా ఆసిఫ్ అనే వ్యక్తి ఫోన్ చేసి తను ఒంగోలులోని ఐసిఐసిఐ బ్యాంకులో పనిచేస్తున్నట్లు పరిచయం చేసుకున్నాడు, అదే బ్యాంక్‌లో పనిచేస్తున్న ఉద్యోగులుగా ,అభిషేక్, సత్యనారాయణ, సాయి మోక్ష్యగ్న, మహేష్ కూడా రకరకాల ఫోన్ నెంబర్లతో కాంటాక్ట్ అయి తనకు లోన్ ఇప్పిస్తానని చెప్పడంతో వారి మాటలు విని లోను కోసం ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్, ఇతర ఖర్చుల కోసం సుమారు 22,30,018 రూపాయలు వారి అకౌంట్లకు పంపాడు. చివరికి అది మోసపోయినట్లు గ్రహించి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

25 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-డెంకాడ

అసిస్టెంట్ కమీషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ ఇందిరా దేవి ఆధ్వర్యంలో ఎస్ ఐ రాజశ్రీ, సిబ్బంది డెంకాడ మండలం చింతలవలసలో కుర్తు అబద్దం 25 బాటిల్స్‌తో, మరో మహిళ 22 బాటిల్స్ తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరి నుంచి ఆ బాటిళ్లను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశారు. ఈదాడిలో హెచ్‌సి. నాగేశ్వరరావు, సుదర్శన్ , ఇసి నాయుడు, మనోజ్ పాల్గొన్నారు

ఎటిఎంల బ్యాటరీ దొంగ అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎటిఎంలో బ్యాటరీలను చోరీ చేసిన దొంగను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. విజయనగరం మండలం చెల్లూరులో ఎటిఎం రిపేరు కావడంతో నిర్వాహకుడు గుంకలాం గ్రామానికి చెందిన లెంక సత్తిబాబుకు స్థానికులు ఫోన్ చేశారు. ఆయన వెళ్లి పరిశీలించేసరికి డోర్ పగిలిపోయి, బ్యాటరీలు మాయమై ఉండడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు చెల్లూరు హైవేపై బ్యాటరీలతో అనుమానాస్పదంగా తిరుగుతున్న అమలాపురానికి చెందిన పి.నాగరాజును అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో ఎటిఎం కేంద్రంలో మూడు బ్యాటరీలు దొంగిలించినట్లు నిందితుడు తెలిపాడు. విశాఖలోని గోపాలపట్నం, పెందుర్తి ఏరియాలో కూడా నేరం చేసినట్లు తెలిపారు.